

అథ్లెటిక్స్‌లో సత్తాచాటిన జయరాం

ప్రజాశక్తి-బొబ్బిలి

జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్‌లో ఎస్ఐబి కానిస్టేబుల్ జయరాంనాయుడు సత్తాచాటారు. పశ్చిమ బెంగాల్‌లోని మిడ్నాపూర్‌లో ఈ నెల 10 నుంచి 12 వరకు జరిగిన జాతీయ స్థాయి మాస్టర్స్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2023 పోటీల్లో 50 ప్లస్ విభాగంలో 5 కిలోమీటర్ల రేస్ వాకింగ్‌లో ఆయన ద్వితీయ స్థానంలో నిలిచారు. జయరాంను ఎస్ఐబి సిఐ ఆర్.జైభీమ్, సిబ్బంది అభినందించారు.



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న జయరాం

పార్లమెంటుకా? అసెంబ్లీకా?

- రానున్న ఎన్నికల్లో దొర ప్రయాణంపై చర్చ
- నేడు అమరావతిలో వైసిపి వర్క్ షాప్
- అభ్యర్థులను ఖరారు చేస్తారనే ఊహాగానాలు

డిప్యూటీ సిఎం పీడిక రాజన్నదొర రానున్న ఎన్నికల్లో ఎటు ప్రయాణిస్తారనే దానిపై చర్చోపచర్చలు సాగుతున్నాయి. వైసిపి తరపున ఆయన పార్లమెంటు అభ్యర్థిగా పోటీ చేస్తారా, మళ్లీ ఎమ్మెల్యేగా నిలబడతారా అన్న అంశంపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. నాలుగుసార్లు ఎమ్మెల్యే అయిన రాజన్నదొర డిప్యూటీ సిఎం, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పదవులను అలంకరించారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏర్పడిన తొలి విడత కేబినెట్‌లోనే ఆయనకు బెర్త్ ఖరారవుతుందని భావించారు. అయితే అనూహ్య రాజకీయ పరిణామాల నేపథ్యంలో రెండో విడతలో ఆయనకు మంత్రివర్గంలో స్థానం దక్కింది. ఈ నేపథ్యంలో సోమవారం అమరావతిలో జరిగే వైసిపి వర్క్‌షాప్‌పై చర్చోపచర్చలు మొదలయ్యాయి.

ప్రజాశక్తి -సాలూరు

మరో ఆరు నెలల్లో గాని, ఏడాదిలో గాని అసెంబ్లీ ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటి నుంచే వైసిపి నాయకత్వం పార్టీ ఎమ్మెల్యేలు, నియోజకవర్గ సమన్వయకర్తలకు గడపగడపకూ ప్రభుత్వం అనే పరీక్ష పెట్టింది. గత ఏడాది మే నెల నుంచి ఈ కార్యక్రమాన్ని రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాల్లోనూ సంబంధిత ఎమ్మెల్యేలు, సమన్వయ కర్తలు నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ తిరిగి సంక్షేమ పథకాల లబ్ధి గురించి వివరిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సిఎం జగన్‌మోహన్ రెడ్డి ఎమ్మెల్యేలు, మంత్రులు, సమన్వయకర్తలకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా ఎమ్మెల్యేలకు వచ్చిన మార్కులు, పార్టీ అంతర్గత సర్వే నివేదికల ఆధారంగా అభ్యర్థులను ఖరారు చేస్తారనే ప్రచారం జోరుగా సాగుతోంది. గతంలో జరిగిన పార్టీ వర్క్‌షాప్‌ల్లో కూడా సిఎం జగన్ ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. పార్టీ అధినేత ఆదేశాల మేరకు డిప్యూటీ సిఎం రాజన్నదొర మేనెల నుంచి గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేల్లో ఆయన ముందంజలో వున్నారు.

గత ఎన్నికల్లోనే..

నాలుగుసార్లు ఎమ్మెల్యే అయిన రాజన్నదొరకు ఎంపి కావాలనే కోరిక బలంగా ఉంది. అసెంబ్లీ నియోజకవర్గ రాజకీయాలతో అలసిపోయిన రాజన్నదొర ఢిల్లీ వైపు చూస్తున్నారు. గత ఎన్నికల సమయంలోనూ ఆయన ఎమ్‌పి కావాలనే కోరిక వ్యక్తం చేశారు. అయితే పార్టీ నాయకులు, కార్యకర్తల ఒత్తిడి మేరకు ఎమ్మెల్యేగానే పోటీ చేశారు. రానున్న ఎన్నికల్లోనైనా ఎమ్‌పి సీటు దక్కుతుందా? అనే ఆశతో ఆయన ఉన్నారు.

సిఎం స్పష్టత ఇచ్చేనా?

గత ఏడాది డిసెంబర్‌లో జరిగిన వర్క్ షాప్‌లో సిఎం జగన్ రాజన్నదొర పనితీరుపై అసంతృప్తి వ్యక్తం చేయడం చర్చనీయాంశమైంది. గడపగడపకూ ప్రభుత్వంలో ఆయన రోజుకు రెండు గంటలే తిరుగుతున్నారనే మాట సిఎం నోట వెంట రావడం రాజన్నదొరతో పాటు వైసిపి శ్రేణులను ఆశ్చర్యానికి గురి చేసింది. పార్టీ అంతర్గత సర్వేల్లో రాజన్నదొర పనితీరును వాస్తవ పరిస్థితి కంటే తక్కువ అంచనా వేశారనే ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో సోమవారం అమరావతిలో నిర్వహించనున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తల వర్క్‌షాప్‌లో వారి పనితీరుపై సిఎం జగన్ స్పష్టత ఇస్తారనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఈ దఫా వర్క్ షాప్‌లో పనితీరు బాగోలేదని, మెరుగుపర్చుకోని ఎమ్మెల్యేలు మంత్రుల పేర్లు బయటపెడతారనే చర్చ జరుగుతోంది. తాజా పరిస్థితుల్లో జరగనున్న వర్క్ షాప్‌లో సీఎం రాజన్నదొర భవితవ్యం ఏమిటనేది తేలిపోనుంది.



పరిస్థితులే అడ్డం!

రానున్న ఎన్నికలు అధికారపార్టీ, ప్రధాన ప్రతిపక్ష పార్టీకి జీవన్మరణ సమస్యగా పరిణమిస్తున్న తరుణంలో వైసిపి అధిష్టానం ఆయన్ను ఎమ్మెల్యే అభ్యర్థిగానే రంగంలోకి దించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. నియోజకవర్గంలో టిడిపి నాయకుల మధ్య గ్రూపు రాజకీయాలు, ఆపార్టీ కేడర్‌లో నిరాశ నిస్పృహలు అధికారపార్టీకి బాగా కలిసొచ్చే అంశాలుగా ఉన్నాయి. గత ఎన్నికల్లో ఇవే అంశాలు ఎమ్మెల్యే రాజన్నదొర గెలుపునకు పని చేశాయి. రానున్న ఎన్నికల్లోనూ అనుకూల అంశాలుగా కనిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఆయన ఎమ్మెల్యే అభ్యర్థిగా ఉంటే గెలుపు సునాయాసమవుతుందనే చర్చ పార్టీ శ్రేణుల్లో నడుస్తోంది. ఎంపీ సీట్లు కన్నా ఎమ్మెల్యే సీట్లు ఎక్కువ వైసిపికి అవసరం కానున్న నేపథ్యంలో రాజన్నదొర అసెంబ్లీ అభ్యర్థిగానే బరిలో ఉంటారని కొంతమంది వైసిపి నాయకులు వాదిస్తున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి మళ్లీ రావాలంటే సీనియర్లు అసెంబ్లీ బరిలోనే వుండాలని అధిష్టానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. అయితే రాజన్నదొర ఢిల్లీ కోరిక ఈసారైనా నెరవేరుతుందా, ఐదోసారి కూడా అసెంబ్లీ కే పరిమితమవుతారా అన్నది తేలాల్సి ఉంది.





న్యాయమూర్తులను సన్మానిస్తున్న జిల్లా జడ్జి, బార్ అసోసియేషన్ నాయకులు, న్యాయవాదులు

హక్కుల రక్షణలో..

న్యాయ వ్యవస్థదే కీలకపాత్ర

- జిల్లా కోర్టు నూతన భవనానికి అనుమతులు
- అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు మంజూరు
- హైకోర్టు న్యాయమూర్తులు

ప్రజాశక్తి-విజయనగరంలీగల్

హక్కుల రక్షణ, భద్రతలో న్యాయవ్యవస్థ కీలకపాత్ర పోషిస్తుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు న్యాయమూర్తులు జస్టిస్ జస్టిస్ సురేష్ రెడ్డి, జస్టిస్ మానవేంద్ర నాథ్ రాయ్ అన్నారు. జిల్లా పర్యటనకు ఆదివారం విచ్చేసిన వీరిని బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని సుజాత ఫంక్షన్ హాలులో న్యాయవాదులు సన్మానించారు. ఈ సందర్భంగా మానవేంద్రనాథ్ రాయ్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థలో తగినంత మౌలిక, సాంకేతిక సదుపాయాలు లేక కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ న్యాయ పరిష్కారాలు జరుగుతున్నాయని అన్నారు. గత కొన్నాళ్లుగా న్యాయ స్థానాల భవనాల పరిస్థితి బాగోలేకపోవడంతో జిల్లా జడ్జి సాయి కల్యాణ చక్రవర్తి, స్థానిక న్యాయవాదులు, ప్రజాప్రతినిధుల కృషి వల్ల జిల్లా కేంద్రంలో నూతన భవన సముదాయ నిర్మాణానికి రూ.1.20కోట్లు మంజూరు అయ్యాయని తెలిపారు. అలాగే అదనపు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు ఏర్పాటుకు అనుమతులు మంజూరు అయ్యాయన్నారు.

జిల్లా పోర్టు పోలియో జడ్జి కె.సురేష్‌రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో అందరి కృషి వల్లే నేడు జిల్లా కోర్టు నూతన భవనం మంజూరైందన్నారు. భవన నిర్మాణం పూర్తయ్యేవరకు ఇదే కృషి, పట్టుదలతో పనిచేస్తేనే అనుకున్న కల సాకారం అవుతుందన్నారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ అనుమతులకు కృషి చేసిన న్యాయమూర్తులను న్యాయ వాదుల సంఘం అధ్యక్షుడు బి.సంజీవరావు, రాష్ట్ర బార్ కౌన్సిల్ మాజీ ఉపాధ్యక్షుడు కెవిఎన్ తమ్మన్న శెట్టి ఆధ్వర్యాన న్యాయవాదులంతా సన్మానించారు.



న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

న్యాయమూర్తులను కలిసిన కలెక్టర్

జిల్లా పర్యటన కోసం ఆదివారం విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ జస్టిస్ సురేష్ రెడ్డి, జస్టిస్ మానవేంద్ర నాథ్ రాయ్ లను కలిసిన జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి మర్యాద పూర్వకంగా కలిశారు. న్యాయమూర్తులకు పుష్పగుచ్ఛాలు అందజేశారు. జిల్లాలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు తదితర అంశాలను వారికి వివరించారు.



ధర్నా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు, బాధితులు

తొలగించిన చోటే ఇళ్లు కట్టివ్వాలి

సిపిఎం నగర కార్యదర్శి శంకర్రావు • నేడు కలెక్టరేట్ ఎదుట ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో బొగ్గుల దిబ్బ వద్ద ఇళ్లు తొలగించిన చోటే పేదలకు ఇళ్లు కట్టి ఇవ్వాలని సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకర్రావు డిమాండ్ చేశారు. 117 మంది నిరుపేద దళితులు గత 50 ఏళ్లగా బొగ్గుల దిబ్బ వద్ద నివాసముంటున్నారని, వీరి ఇళ్లను అక్రమంగా తొలగించిన వైసిపి కార్పొరేటర్ ధనలక్ష్మిని అరెస్టు చేసి, ఎస్‌సి,ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని అన్నారు. ఆదివారం బొగ్గుల దిబ్బ వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇళ్లు తొలగించిన చోటే 225 జీవో ప్రకారం ఇళ్లు కట్టి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎటువంటి ముందస్తు నోటీసులు ఇవ్వకుండా ప్రభుత్వం, మున్సిపల్ అధికారులు జెసిబితో ఇళ్లను అక్రమంగా తొలగించడాన్ని ఖండించారు. పేదలకు న్యాయం చేయాలని సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తామని తెలిపారు. సమావేశంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, ఆర్.ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఉనికి కాపాడుకునేందుకు కుయుక్తులు

టిడిపిపై కోలగట్ల విమర్శలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తెలుగుదేశం పార్టీలో నవలా రచయితలు తయారయ్యారని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి విమర్శించారు. ఉనికి కాపాడుకునేందుకే కుయుక్తులు పన్నుతున్నారని అన్నారు. ఆదివారం ఆయన తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జగనాసుర రక్త చరిత్ర అంటూ ఒక పుస్తకం విడుదలైందని, ఆ పుస్తకానికి ఎడిటర్ హోదాలో అచ్చెన్నాయుడే వ్యవహరించినట్లుగా ఉందని అన్నారు. పుస్తకంలో రచన, డైరెక్షన్, ప్రొడక్షన్ అన్నీ తెలుగుదేశం వారే కావడం విచిత్రమన్నారు. గతంలో చంద్రబాబు తన సొంత మామ ఎన్టీఆర్ ను వెన్నుపోటు పొడిచి, చివరకు ఆయన మరణానికి పరోక్ష కారణమైనప్పటికీ ఎల్లో మీడియాను అడ్డం పెట్టుకొని పబ్బం గడుపుకునే పరిస్థితి అందరికీ తెలిసిందేనని అన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ప్రజలకు ఏం మేలు చేశారో చెప్పాలన్నారు. రానున్న ఎన్నికలలో ఓటు అడిగే ధైర్యం ఆయనకు లేదన్నారు. సరైన పాలన అందించకే 2019లో ఓటమిపాలయ్యారని అన్నారు .ప్రస్తుతం రాష్ట్రంలో అవినీతి రహిత పాలన సాగుతుందన్నారు. ఆ ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. త్వరలో రాష్ట్రంలో ఇండస్ట్రియల్ సమ్మిట్ జరుగుతున్న నేపథ్యంలో అనేక పరిశ్రమలు ఏర్పాటుకు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. మారుమూల ప్రాంతంలో రాజధాని ఏర్పాటు చేసి పరోక్షంగా పరిశ్రమలు రాకుండా చేసిన ఘనత బాబు దేనని అన్నారు. ప్రజా అవసరాలను తీర్చే బాధ్యత ప్రభుత్వానిదే అంటున్న అశోక్ గజపతిరాజు జిల్లాలో అనేక సంవత్సరాలుగా మంత్రిగా ఉన్న ఆయన ప్రజలకు ఏ అవసరాలు తీర్చారో చెప్పాలని అన్నారు. ప్రజలకు కష్టసుఖాలను పట్టించుకోని ఆయన నేడు ప్రజావసరాల గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. తాము ప్రజల మధ్యలోనే ఉంటూ నియోజకవర్గం అభివద్ధికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధిలో ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.



మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ఉపాధ్యాయులపై ఒత్తిడి చేయొద్దు

ఎమ్మెల్సీ రఘువర్మ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉపాధ్యాయులపై ఉన్నతాధికారుల ఒత్తిడి మానుకోవాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పి.రఘువర్మ అన్నారు. ఆదివారం నగరంలోని లక్క పందిరి వీధిలోగల ఎపిటిఎఫ్ భవనంలో షేక్ బుఖారి బాబు అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పుల భానుమూర్తి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ రాష్ట్రంలోను, జిల్లాలోను ఉపాధ్యాయులపై ఏదో ఒక కారణం చూపి ఉన్నతాధికారులు ఒత్తిడి చేయడాన్ని ఖండించారు. అధికారుల తీరు ఉపాధ్యాయుల బోధనకు ఆటంకం కలిగించే విధంగా ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సంపూర్ణ లత, పిల్లా తిరుపతి , నల్లా రవికుమార్, రాష్ట్ర కౌన్సిల్ రవి గౌరవ అధ్యక్షులు జోగినాయుడు, మర్రాపు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘువర్మ



మాట్లాడుతున్న బిసి సంక్షేమ, సాధికారత అధికారి ఎం.యశోదనరావు

వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం

బిసి సంక్షేమ, సాధికారత అధికారి ఎం.యశోదనరావు

ప్రజాశకి-విజయనగరం టౌన్

బిసి సంక్షేమశాఖ పరిధిలోగల వసతి గృహ విద్యార్థులు శత శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా చదవాలని ఆశాఖ జిల్లా సంక్షేమ, సాధికారిత అధికారి యశోదనరావు అన్నారు. వసతిగృహాల్లో చదువుకుంటున్న పదో తరగతి విద్యార్థులకు ఆదివారం ప్రేరణ, పునశ్చరణ తరగతులు కస్పా హైస్కూలు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సబ్జెక్టుల నిపుణులతో పలు అంశాలపై బోధించారు. బిసి సంక్షేమాధికారి బివి రమణ ఆధ్వర్యాన జరిగిన ఈకార్యక్రమంలో యశోధనరావు మాట్లాడారు. శతశాతం ఉత్తీర్ణతకు కష్ట పడి పనిచేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. హైస్కూలు ప్రధానోపాధ్యాయుడు జి.శంకరరావు మాట్లాడుతూ ఈ అవకాశాన్ని వసతిగృహ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వసగృహ సంక్షేమాధి కారులు డి.జానకీరావు, జి.చంద్రమౌళి, ఇ.అప్పన్న, సన్యాసిరావు. బి. అప్పలకొండ, ఆర్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

అన్నార్తుల ఆకలి తీరుస్తున్న ఫుడ్ బ్యాంకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో ఫుడ్ బ్యాంకులు అన్నార్తులకు ఆకలి తీర్చే కేంద్రాలుగా ఉపయోగ పడుతున్నాయని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఈశ్వర్ కౌశిక్ అన్నారు. శనివారం నగరంలోని ఎన్ సి ఎస్ థియేటర్ ఎదురుగా గల ఫుడ్ బ్యాంక్ వద్ద గౌరీ సేవా సంఘం కార్యదర్శి కనిశెట్టి సుధాకర్ తమ తాత పైడినాయుడు, పిల్లా సత్యారావుల జ్ఞాపకార్థం సొంత నిధులతో ఏర్పాటు చేసిన భోజన వసతి శాలను వీరు ప్రారంభించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన ఉచిత అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర ఆసుపత్రి సలహా మండలి సభ్యులు ఆడారి నగేష్, గౌరీ సేవా సంఘం అధ్యక్షులు కాండ్రేగుల శేఖర్, కార్యదర్శి కనిశెట్టి సుధాకర్, చిన్నారావు పాల్గొన్నారు.

శివరాత్రికి పక్కాగా ఏర్పాట్లు

ఆర్‌డిఒ సూర్యకళ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

పుణ్యగిరికొండపై ఈనెల 18న మహాశివరాత్రి, 19న జాగరణ స్నానాలకు వచ్చే యాత్రికు లకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆర్‌డిఒ సూర్యకళ, డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు.. దేవాదాయ శాఖ, మండల అధికారులను ఆదేశించారు. పుణ్యగిరి కొండపై శివరాత్రి ఏర్పాట్లను ఆదివారం ఆర్‌డిఒ, డిఎస్‌పి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు పలు పాయింట్లను పరిశీలించారు. వాష్ రూములను ఏర్పాటు చేయాలని, మెట్లు జారుడుగా లేకుండా చూడాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి మహాశివరాత్రి జాతరను విజయవంతం చేయాలని కోరారు. పుణ్యగిరి విశిష్టతను ట్రస్టుబోర్డు చైర్మన్ రామకృష్ణ తెలియజేశారు. ఆలయ అర్చకులు మణిశర్మ వేద ఆశీర్వచనం అందించారు. వీరి వెంట సిఐ సింహాద్రి నాయుడు, తహశీల్దార్ డి.శ్రీనివాసరావు, ఎస్ఐ జె.తారకేశ్వరరావు, దేవాదాయ శాఖ ఇఒ నాగేంద్ర, పంచాయతీ ఇఒ పాత్రో, మేస్త్రీ నానిగిరి కృష్ణ తదితరులు ఉన్నారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సూర్యకళ

రాష్ట్ర స్థాయి పోటీలకు చెస్ క్రీడాకారుల ఎంపిక



రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అండర్ 15 ఓపెన్ చదరంగం రాష్ట్ర పోటీలకు జిల్లా ఆదివారం జరిగిన సెలక్షన్ విభాగంలో బాలుర విభాగంలో కాండ్రేగుల ప్రహ్లాద్, అక్కివరపు పర్వేష్, సత్యసాగర్ నాయుడు, జూలూరు భాను కార్తికేయను, బాలికల విభాగంలో అక్కివరపు జాస్మిన్, అట్టాడ దీక్ష శ్రీ, అట్టాడ ధనుశ్రీ , కుందన ప్రియలను రాష్ట్ర స్థాయి చెస్ పోటీలకు ఎంపిక చేశారు.దీనికి చీఫ్ ఆర్బిటర్ గా సైదా బేగం మరియు డిప్యూటీ ఆర్బిటర్ గా శ్రీనివాస్ రావు వ్యవహరించారు, అని విజయనగరం జిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి కె వి. జ్వాలాముఖి గారు తెలియజేశారు. ఎంపికైన వారు త్వరలో జరగనున్న రాష్ట్ర పోటీల్లో పాల్గొనున్నారు అని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు తెలిపారు.

ప్రాణదాతలుగా నిలవాలి

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

నేటి యువత రక్తదాతలుగా మారి ప్రాణదాతలుగా నిలవాలని డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి పిలుపునిచ్చారు. ఆదివారం దాసన్నపేట సింగపూర్ సిటీ ఆవరణలో రోటరీ క్లబ్ విజయనగరం సెంట్రల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజ హితం కోసం రోటరీ క్లబ్ ఇలాంటి సేవా కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. రోటరీ క్లబ్ చేసే ప్రతి కార్యక్రమానికి తమ వంతు సహాయ సహకారాలు ఉంటాయన్నారు. యువత ముందుకు వచ్చి రక్తదానం చేసి , ప్రాణాలు నిలబెట్టాలని అన్నారు. రక్తదానం చేసిన యువతను ఆమె ప్రోత్సహించారు. ఈ సందర్భంగా రోటరీ క్లబ్ ద్వారా సర్టిఫికెట్లను దాతలకు అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రతినిధులు , రక్త దాతలు పాల్గొన్నారు.

విజయనగరం కోట : సమాజ సేవ, రక్తదానం లో యువత పాత్ర కీలకమని క్వీన్స్ ఎన్ఆర్ఐ ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ దర్భిపూడి అన్నారు. ఆదివారం నగరంలోని క్వీన్స్ ఎన్ఆర్ఐ హాస్పిటల్, మేమున్నాం స్వచ్ఛంద సేవా సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఆసుపత్రి ఆవరణలో రక్తదాన శిబిరం నిర్వహించారు. రక్తదాన శిబిరాన్ని ప్రారంభిన హాస్పిటల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రమేష్ అనంతరం మాట్లాడుతూ పట్టణంలో యువత అత్యవసర సమయంలో రక్తం ఇవ్వడంలో ముందుంటారని కొనియాడారు. ప్రాణాపాయస్థితిలో ఉన్న ప్రతి ఒక్కరికీ ఎంతో ఉపయోగపడుతుందన్నారు. మేమున్నాం స్వచ్ఛంద సంస్థ అధ్యక్షులు కంది సత్యనారాయణ మూర్తి మాట్లాడుతూ అత్యవసర సమయంలో ఆపదలో ఉన్నవారికి తక్షణం రక్తం చేరేలా ఏర్పాట్లు చేయడం అభినందనీయమన్నారు. సుమారు 30 మంది యువత ముందుకు వచ్చి రక్తదానం చేశారు.



రక్తదాతలతో డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

స్విమ్మింగ్ పోటీల్లో పతకాల పంట

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కృష్ణా జిల్లా ఈడుపుగల్లు జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగిన రా ష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో విజయనగరానికి చెందిన కె.షణ్ముఖ 100 మీటర్ల విభాగంలో కాంస్య పతకం, కెవిఎస్ సిద్ధార్థ నాయుడు 200 మీటర్ల విభాగంలో గోల్డుమెడల్, 100 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగంలో కాంస్య పతకం, కె.ధనుంజయ నాయుడు 100 మీటర్ల ఫ్రీ స్టయిల్ విభాగంలో బంగారు పతకం సాధించారు. జె.జస్వంత్‌శ్రీ 50 మీటర్లు బ్యాక్ స్ట్రోక్ విభాగం, వంద మీటర్ల విభాగంలో బంగారు పతకం సాధించాడు. యువ తేజస్ 200 మీటర్ల ఫ్రీస్టైల్‌లో కాంస్యపతకం, జి.సాకేత్ 15మీటర్ల లో బ్రాంజ్ పతకం సాధించాడు. కోచ్, మేనేజర్ పివిఎస్ఎన్ రాజు, సూర్యనారాయణను, క్రీడాకారులకు స్కూలు గేమ్స్ జిల్లా కార్యదర్శి ఎల్‌వి రమణ అభినందించారు.



సాధించిన పతకాలతో స్విమ్మింగ్ క్రీడాకారులు



మూడో స్థానంలో నిలిచిన జిల్లా జట్టు క్రీడాకారులు

షూటింగ్ బాల్‌లో మూడో స్థానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

41వ సీనియర్స్ షూటింగ్ బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో విజయనగరం పురుషుల జట్టు మూడో స్థానంలో నిలిచింది. మూడు రోజులుగా నూజివీడులో జరిగిన ఈ పోటీల్లో సెమీఫైనల్‌కి వెళ్లిన విజయగనరం జట్టు మూడో స్థానం సాధించింది.క్రీడాకారులకు అసోసియేషన్ కార్యదర్శి కష్ణమూర్తి అభినందనలు తెలిపారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక థామస్‌పేట ఫుట్‌బాల్ మైదానంలో మోడీ కబడ్డీ కప్ జిల్లా స్థాయి పోటీలు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను యువమోర్చా రాష్ట్ర అధ్యక్షులు కేతినేని సురేంద్ర మోహన్, బిజెపి జిల్లా అధ్యక్షులు రెడ్డి పావని ప్రారంభించారు. 16 పురుషుల జట్లు, 4 మహిళల జట్లు పాల్గొన్నాయి. కార్యక్రమంలో యువ మోర్చా జిల్లా అధ్యక్షులు కాళ్ల నారాయణ రావు, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు బి.శ్రీధర్ పాల్గొన్నారు.



యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు, ఉద్యోగులు

ఉచిత యోగా తరగతులు ప్రారంభం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచితంగా యోగా, మెడిటేషన్ క్లాసులను సంత పేట గవర వీధి శ్రీ జగన్నాథ స్వామి ఆలయంలో ఆదివారం ప్రారంభించినట్లు ఆ సంఘం అధ్యక్షులు కాండ్రేగుల శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా సంఘ అధ్యక్షులు కాండ్రేగుల శేఖర్ మాట్లాడుతూ జీవితంలో ప్రతి ఒక్కరూ తమ గోల్స్ ను చేరుకోవడానికి మానసికంగా ఎంతో ఒత్తిడికి గురవుతున్నారని చెప్పారు. దాన్ని దృష్టిలో పెట్టుకొని యోగా, మెడిటేషన్ లలో శిక్షణ ఇప్పించడం ద్వారా వారు ఎటువంటి ఒత్తిడికీ గురి కాకుండా ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5.30గంటల నుంచి 7గంటల వరకు సూర్య నమస్కారాలతో పాటు యోగా, మెడిటేషన్ క్లాసులను నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ కార్యదర్శి కనిశెట్టి సుధాకర్, కోశాధికారి మొల్లేటి చిన్నా రావు నాయుడు, ఆర్గనైజింగ్ సెక్రెటరీ ఆడారి వెంకట రమణ, మళ్ల రమేష్ తదితరులు పాల్గొన్నారు

పిజి స్టార్ ఆస్పత్రిలో ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి-విజయనగరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు సంతోష్

నగరంలోని పిజి స్టార్ ఆస్పత్రిలో ఆదివారం ఎముకలు, కీళ్ల వైద్య శిబిరం నిర్వహించారు. ఆర్థోపెడిక్ డాక్టర్ మీసాల సంతోష్ ఆధ్వర్యాన తుంటినొప్పులు, మోకాళ్ల అరుగుదల, కండరాలు బిగిసిపోవడం, ఆర్థరైటిస్, దీర్ఘకాలిక నొప్పులు, స్పాండిలోసిస్, డిస్క్ సమస్యలు ఉన్న వారికి ఉచితంగా తనిఖీలు చేసి మందులు అందజేశారు. ఫిజియోథెరపిస్టు డాక్టర్ పొన్నాడ రామకృష్ణ ఆధ్వర్యాన ఎముకలు, కండరాల్లో సమస్యలు ఉన్న వారికి ఉచితంగా ఫిజియోథెరపీ చేశారు. 120 మంది ఉచిత వైద్య సేవలను వినియోగించుకున్నారు. ఎముకలు, కీళ్ళు, తుంటిలో సమస్యలు ఉన్న వారికి ఉచితంగా ఆపరేషన్లు కూడా చేస్తామని వైద్యులు తెలిపారు.

ఏనుగుల పట్ల అప్రమత్తం

ప్రజాశక్తి -భామిని

ఇటీవల ఒడిశా నుంచి వచ్చి గత వారం రోజులుగా మనుమకొండ పంచాయతీ పరిధిలో ఆరు ఏనుగుల గుంపు సంచరిస్తున్నాయని, కావున ప్రజలు అప్రమతంగా ఉండాలని వైసిపి మండల కన్వీనర్ తోట సింహాచలం గ్రామస్తులకు సూచించారు. ఆదివారం ఆయన మండలంలోని మనుమకొండ పంచాయతీలో ఏనుగుల గుంపు సంచరిస్తున్న గ్రామస్తులను పరిశీలించారు. ఈ ప్రాంతం పూర్తిగా గిరిజనులే ఉన్నారని, ఉదయం పూట పొలాలకు, జీడీ, మామిడి తోటలు కాపుకు వెళ్తుంటారని అన్నారు. అలాగే పోడు వ్యవసాయ చేసే వారు, పొలం పనులు చేసే రైతులను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసి, జాగ్రత్తలు తీసుకోవాలని అటవీశాఖ, టేక్‌కేరర్స్‌కు సూచించారు. మనుమకొండ పంచాయతీ పరిధిలో గల కొత్తూరు గూడ, పకుడు భద్ర, మనుమకొండ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఏనుగులు వద్దకు వెళ్లి వీడియో, సెల్ఫీలకు ప్రయత్నించొద్దని, అటవీ సిబ్బందికి గ్రామస్తులు సహకరించాలని కోరారు. అలాగే స్థానిక ప్రజా ప్రతినిధులు బాధ్యతాయుతంగా ప్రజలను అప్రమత్తం చేయాలని కోరారు. ఈ పరిశీలనలో వైస్ ఎంపిపి బోనగడ్డి ధర్మారావు కోపరేట్ డైరెక్టర్ అర్లి రాజశేఖర్, వైసిపి నాయకులు సిడగంటి రామారావు ఉన్నారు.

విజ్ఞానాన్ని పెంచుకోవాలి

ప్రజాశక్తి -పాలకొండ రూరల్

గ్రంథాలయం ద్వారా లభించే పుస్తకాలను పాఠకులు సద్వినియోగం చేసుకొని విజ్ఞానాన్ని పెంచుకోవాలని ఇన్‌ఛార్జి గ్రంథాలయాధికారి బబ్బూరు గణేష్‌బాబు అన్నారు. పాలకొండ శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయంలో లభించే విలువైన పుస్తకాన్ని చదివి భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీనియర్స్ రీడర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

ప్రజాశక్తి - సీతంపేట

స్థానిక ఎన్టీఆర్ అడ్వెంచర్ పార్కులో ఆదివారం సెలవు దినం కావడంతో పర్యాటకులు ఉల్లాసంగా ఉత్సాహంతో గడిపారు. పార్కులో ఉన్న అందాలను ఆస్వాదించారు. చిన్నారులు మినీ ట్రైన్ ఎక్కి సరదాగా గడిపారు. యువత హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడిచి వెళ్లారు. కొంతమంది పర్యాటకులు విలువిద్య, గన్ షాట్ షూటింగ్ చేశారు. ఆనంద విహార వద్ద డాన్సులు వేసి ఉల్లాసంగా ఉత్సాహంతో కేరింతలు కొట్టారు. జెయింట్ వీల్ ఎక్కి ఉయ్యాలో ఊగారు అనంతరం మెట్టిగూడ జలపాతాన్ని సందర్శించారు. ఈ ఆదివారం జిసిసి మేనేజింగ్ డైరెక్టర్ సురేష్‌కుమార్ దంపతులు పార్కును తిలకించారు.

రాష్ట్రంలో వైసిపి దుష్ట పరిపాలన : టిడిపి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఆనాడు పాదయాత్రలో ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి అయ్యాక ఏ ఒక్కటీ నెరవేర్చకుండా ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి రాష్ట్రంలో దుష్ట పరిపాలనను ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి కొనసాగిస్తున్నారని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకులు దత్తి లక్ష్మణరావు విమర్శించారు. గరుగుబిల్లి మండలం చిలకాంలో ఇదేం కర్మ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు ద్వారపురెడ్డి సత్యనారాయణ, బిడ్డిక పద్మావతి, పువ్వల లావణ్య, బిడ్డిక తమ్మయ్య, విజయ్‌కుమార్, భూపతి దొర పాల్గొన్నారు.

కుల ధ్రువపత్రాలు అందక.. సంక్షేమానికి నోచక..

- అవస్థలు పడుతున్న యానాదులు
- దశాబ్దాలుగా నిర్లక్ష్యం వహిస్తున్న అధికారులు
- నెరవేరని ఎమ్మెల్యే హామీ

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి పట్టణంలో యానాదులు తెగకు చెందిన గిరిజనులు ఎన్నో దశాబ్దాల నుంచి జీవనం సాగిస్తున్నారు. 15 ఏళ్ల క్రితం వీరంతా రైల్వే రోడ్డు, స్వామివారివీధి పార్కు గట్టుపై జీవనం సాగించేవారు. వీరికి సొంతిళ్లు లేకపోవడంతో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా పని చేసిన సమయంలో ఇందిరమ్మ కాలనీలో ఎస్‌టి కోటాలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు. అప్పటి నుంచి వీరంతా ఇందిరమ్మకాలనీలో జీవనం సాగిస్తున్నారు. వీరికి ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు మాత్రం రెవెన్యూ అధికారులు మంజూరు చేయడం లేదు. కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వకపోవడంతో సంక్షేమ పథకాలు అందడం లేదు. పిల్లలను చదివించుకోలేక పోతున్నామని యానాదులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమకు ఎస్‌టి కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలని అధికారులను వేడుకొంటున్నారు.

ప్రభుత్వ పథకాలకు, చదువుకు దూరం

ఎస్‌టి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో యానాదులు ప్రభుత్వ సంక్షేమ పథకాలకు, పిల్లలు చదువుకు



సంక్షేమ పథకాలకు నోచని యానాదులు

దూరమవుతున్నారు. ఇందిరమ్మ కాలనీలో మర్రి, మాణికల, నంబురి, చెరుకుబిల్లి, మామిడి, పాముల, చెర్లచెల్లాలు, నిమ్మక, పసుపురెడ్డి, పిట్ల ఇంటి పేర్లతో 35 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. వీరంతా కొన్నేళ్లుగా ఎస్‌టి ధ్రువీకరణ పత్రాలు కోసం దరఖాస్తు చేసుకుంటున్నా రెవెన్యూ అధికారులు మంజూరు చేయడం లేదు. ఇందిరమ్మ కాలనీలో నివాసముంటున్న ఇంటి పేర్లతో ఎస్‌టి సర్టిఫికెట్ కలిగిన వారు బొబ్బిలి మండలంలో లేరు. ఇతర మండలాల్లో ఉన్నప్పటికీ ఆయా సర్టిఫికెట్లను దరఖాస్తుతోపాటు జత చేస్తున్నా బొబ్బిలి మండలంలో ధ్రువపత్రాలను మాత్రమే జత చేయాలని చెప్పి రెవెన్యూ అధికారులు తిరస్కరిస్తున్నారు. దీంతో వారంతా సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదు.

ఎమ్మెల్యే ప్రకటన బుట్టదాఖలు

ఇందిరమ్మ కాలనీలోని యానాదులకు ఎస్‌టి ధ్రువపత్రాలు ఇప్పిస్తామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు కొన్ని నెలలు క్రితం ప్రకటించారు. యానాదులు, నక్కల కులస్తులు ఎస్‌టి జాబితాలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్నప్పటికీ తాను యానాదులు, నక్కల సామాజిక తరగతులను ఎస్‌టి జాబితాలో చేర్పించాలని ప్రభుత్వానికి లేఖ రాసినట్లు చెప్పారు. దీంతో కేంద్రప్రభుత్వం నుంచి ఎస్‌టి జాబితాలో చేరుస్తూ జిఒ వచ్చిందని చెప్పి విలేకరుల సమావేశంలో ఆ కాపీని ఎమ్మెల్యే చూపించారు. ఇక నుంచి యానాదులకు ఎస్‌టి సర్టిఫికెట్లు మంజూరవుతాయని ఆయన ప్రకటించారు. కానీ నేటికీ ఎస్‌టి సర్టిఫికెట్లు మంజూరు కావడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఎస్‌టి ధ్రువపత్రాలు మంజూరయ్యేలా చూడాలని యానాదులు కోరుతున్నారు.



దట్టంగా కురుస్తున్న పొగమంచు



లైట్లు వేసుకుని వస్తున్న వాహనాలు

మంచు దుప్పటి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో మూడు రోజులుగా మంచు దట్టంగా కురుస్తోంది. ఉదయం 8.30 గంటల వరకు గ్రామాలు మంచు ముసుగులో ఉంటున్నాయి. ప్రధాన రహదారిపై మంచు విపరీతంగా కురవడంతో వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. దగ్గరకు వచ్చే వరకూ ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించడం లేదు. ఇలా మంచు పడడంతో మామిడి, జీడి పంటలకు కూడా నష్టం కలిగే అవకాశాలు ఉన్నాయి.

నిధుల్లేక నిలిచిన పనులు

ప్రజాశక్తి-వేపాడ



వేపాడ హైస్కూల్లో పిల్లర్లు నిర్మించిన వదిలేసిన భవనం

మండలంలో వివిధ పాఠశాలలకు అదనపు గదులు, భవనాలను నాడు-నేడు కార్యక్రమంలో భాగంగా రెండో విడతలో ప్రభుత్వం మంజూరు చేసింది. నిధులు మంజూరైనంత వరకూ పనులు చేపట్టారు. ప్రభుత్వం నుంచి నిధులు రాకపోవడంతో ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. నిధులు మంజూరైతే తప్ప పనులు ముందుకు సాగే అవకాశం లేదు. వేపాడ, సోంపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలు, కెజిబివిలో రెండో విడత ప్రారంభించిన పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. దీనికి నిధులు మంజూరుకాకపోవడమే కారణంగా తెలుస్తోంది.

95 శాతం మందికి డిఇసి మాత్రలు

ప్రజాశక్తి-కొత్తవలస



డిఇసి మాత్రలను మింగిస్తున్న గురుకులం ప్రిన్సిపల్ జయశ్రీ

వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలో 24 గ్రామాలలో 18267 మందికి గాను 17,485 మందికి (95శాతం) డిఇసి, ఆల్‌బెండజోల్ మాత్రలు మింగించినట్లు వైద్యాధికారి గోపాలకృష్ణ తెలిపారు. ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు, వాలంటీర్లు బోధవ్యాధి నివారణకు డిఇసి మాత్రలు, కడుపులో నులిపురుగుల నివారణకు ఆల్‌బెండజోల్ మాత్రలు ఇంటింటికి పంపిణీ చేసినట్లు వివరించారు. మిగతా ఐదు శాతం మందికి సోమవారం పంపిణీ చేస్తామని వివరించారు. వియ్యంపేట బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యార్థినులకు ప్రిన్సిపల్ టి.జయశ్రీ ఆధ్వర్యంలో, బిసి బాయ్స్ హాస్టల్‌లో వార్డెన్ సమక్షంలో వైద్యాధికారులు మాత్రలు మింగించారు. రామలింగాపురం, నిమ్మలపాలెంలో ఎఎన్‌ఎంలు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒలు గోవిందరాజులు, తిరుపతిరావు, పిహెచ్ఎన్. జగదాంబ, హెచ్‌వి.పద్మావతి, హెచ్ఎస్ రాము, హెల్త్‌అసిస్టెంట్ సత్యారావు, ఎఎన్ఎం భవాని పాల్గొన్నారు.

ఇపిఎఫ్ పింఛనర్ల సమావేశం

ప్రజాశక్తి-గరివిడి



సమావేశంలో మాట్లాడుతున్న ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సుధాకర్

గరివిడి ఫేకర్ ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం ఇపిఎఫ్ పింఛనర్ల సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుధాకర్ మాట్లాడారు. ఇపిఎఫ్ కనీస పింఛను రూ.9 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉచిత వైద్యం అందించాలని, ప్రయాణంలో 60 శాతం రాయితీ కల్పించాలని కోరారు. ఈ డిమాండ్లపై సోమవారం విజయనగరంలోని ఇపిఎఫ్ రీజనల్ కార్యాలయం వద్ద చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో విజయనగరం జిల్లా పెన్షనర్స్ సంఘం గౌరవ అధ్యక్షులు టి.వి రమణ, ప్రధాన కార్యదర్శి ఎ.నాగభూషణం, చీపురుపల్లి నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి ఒఎస్ఎన్ మూర్తి, సిఐటియు డివిజన్ అధ్యక్షులు జె.విశ్వనాథ్ రాజు, ప్రధానకార్యదర్శి ఎ.గౌరినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆ రంగంలో అద్భుత అవకాశాలు

ఖరగ్‌పూర్ ఐఐటి ప్రొఫెసర్ అరిజిత్‌దే



మాట్లాడుతున్న ఖరగ్‌పూర్ ఐఐటి ప్రొఫెసర్ అరిజిత్‌దే

ప్రజాశక్తి-విజయనగరం

ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ రంగంలో అద్భుతమైన అవకాశాలు ఉన్నాయని ఖరగ్‌పూర్ ఐఐటి ప్రొఫెసర్ అరిజిత్‌దే అన్నారు. స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్‌లో అవకాశాలు' అనే అంశంపై ఆదివారం జరిగిన సదస్సులో ప్రొఫెసర్ అరిజిత్‌దే ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకాగ్రతతో కూడిన నిరంతర సాధన ద్వారా మాత్రమే ఏ రంగంలోనైనా అత్యున్నత శిఖరాలను అదిరోహించ వచ్చునని అన్నారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను సందర్భోచితంగా మెరుగుపరుచుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం ఖరగ్‌పూర్ ఐఐటి ప్రొఫెసర్లు డాక్టర్ దెబాశిష్ గయాన్, డాక్టర్ బిశ్వజిత్ ప్రమానిక్ తదితరులు మాట్లాడారు. సీతం కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణ రావు, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డివి రామమూర్తి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు మోడల్ టెస్ట్

ప్రజాశక్తి-శృంగవరపుకోట



ధర్మవరం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు స్నేహ సంస్థ ఆధ్వర్యాన మోడల్ టెస్ట్‌ను ఆదివారం నిర్వహించారు. కొట్టాం, ధర్మవరం, ఎస్.కోట, తిమిడి, బొద్దాం, వెంకటరమణ పేట తదితర హైస్కూళ్లలో ఈ పరీక్షను ఏర్పాటుచేశారు. సుమారు 450 మంది విద్యార్థులు హాజరయ్యారు. మార్చి 8న స్నేహ సంస్థ వార్షికోత్సవం సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతులు అందించి, తల్లిదండ్రులకు సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామని సంస్థ ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బారావు ప్రకటించారు. ఈ పరీక్షలను స్నేహ సభ్యులు విన్నకోట మురళి, వేమలి రమేష్, షేక్ సబీబుల్లా, ఎం.ఎస్.ఎన్.మూర్తి, పొట్నూరు శ్రీరాములు, రామనారాయణరావు తదితరులు పర్యవేక్షించారు.

సాములు కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

చేతిలో చిల్లి గవ్వ లేక ఆర్థిక పరిస్థితుల వలన చనిపోయిన భార్య మతదేహాన్ని భుజాన వేసుకొని ఒడిస్సా రాష్ట్రం కోరాపుట్ జిల్లా మిత్తిపాడు గ్రామానికి కాలినడకన బయలుదేరిన ఈడ సాములుకు ఎస్.కోట మండలం రాజీపేట వద్దగల సంబల నగరి గాయత్రిమాత ఆశ్రమ నిర్వాహకులు ఆర్థిక సాయం అందించారు. కొద్దిరోజుల క్రితం విజయనగరం మండలం చెల్లూరు సమీపంలో భార్య మృతదేహాన్ని భుజాన వేసుకొని కాలినడకన బయలుదేరిన సాములను పరిస్థితి తెలుసుకున్న విజయనగరం రూరల్ సిఐ తిరుపతిరావు స్పందించి మృతదేహాన్ని వారి గ్రామానికి తీసుకెళ్లేందుకు ఏర్పాట్లు చేసిన విషయం తెలిసిందే. పరిస్థితి తెలుసుకున్న గాయత్రి మాత ఆశ్రమం ధ్యానం నాన్న శిష్యులైన మురళీ కిషోర్, సత్తిబాబు, అప్పారావు ఆదివారం కోరాపుట్ జిల్లా మిర్తిపాడు వెళ్లి సామల కుటుంబానికి రూ.25 వేలు నగదు, తినుబండారాలు అందజేశారు.



ఆర్థిక సాయం అందిస్తున్న ఆశ్రమ నిర్వాహకులు



శ్రీనివాసరావును సన్మానిస్తున్న బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు

బ్యాడ్మింటన్ క్రీడాకారుడికి సన్మానం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఎపి మాస్టర్స్ ఓపెన్ ఛాంపియన్‌షిప్‌లో 40 ప్లస్ సింగిల్స్ విభాగంలో రన్నర్‌గా నిలిచిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు మీసాల శ్రీనివాసరావును ఆ అసోసియేషన్ సభ్యులు ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ అందరి సహకారంతోనే విజయం సాధ్యమైందని తెలిపారు. గోవాలో మార్చిలో జరిగే జాతీయ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షులు పైడిరాజు మాట్లాడుతూ నెల్లిమర్లకు ఇండోర్ స్టేడియం మంజూరు చేస్తే రానున్న తరానికి ఎంతో మేలు చేసినట్టు అవుతుందన్నారు. ఇప్పటికే అసోసియేషన్ నుంచి స్టేడియం నిమిత్తం స్థలం కోసం అధికారులు, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. స్థానిక నాయకులు చిక్కాల సాంబశివరావు సహకారంతో స్టేడియం మంజూరు అవుతుందని ఆశిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షులు లెంక శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి వి.ఎం.కె.లక్ష్మణరావు, కోశాధికారి ఎ.శేఖర్, సీనియర్ క్రీడాకారులు శ్రీనివాసరావు, అసోసియేషన్ ప్రతినిధులు రవికిరణ్, నల్లి శివ, జయప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్దివలసలో కాలువ నిర్మాణం

ప్రజాశక్తి-వంగర

మండలంలోని మద్దివలసలో సర్పంచ్ ఉత్తరావల్లి గణేష్ బెనర్జీ ఆధ్వర్యంలో కాలువ నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గ్రామంలో కాలువలు సరిగా లేకపోవడంతో అక్కడ ప్రజలు ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం ప్రధాన రోడ్డుకు ఇరువైపులా గ్రామ శివారు వరకు కాలువ నిర్మాణ పనులు చేపడుతుండటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



కాలువ నిర్మాణం చేపడుతున్న కార్మికులు

'స్వార్థపరుల వల్ల పార్టీకి నష్టం'

ప్రజాశక్తి-వేపాడ

కొంతమంది స్వార్థపరుల వల్ల టిడిపికి నష్టం కలిగే అవకాశం ఉందని తెలుగు యువత మండల అధ్యక్షులు ముక్క రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. టిడిపి మండల అధ్యక్షులుగా గొంప వెంకటరావును అధిష్టానం నియమించినప్పుడే తనకూ బాధ్యతలు అప్పగించిందని పేర్కొన్నారు. ఇటీవల వేరొకరిని తెలుగు యువత మండల అధ్యక్షులుగా ఎంపిక చేసినట్లు డెక్క ఈశ్వరరావు వాట్సాప్ ద్వారా హల్‌చల్ చేస్తూ పార్టీలో కలవరం రేపుతున్నారని చెప్పారు. ఇటువంటి తప్పుడు ప్రచారం చేస్తున్న కొంతపంది స్వార్థపరుల వల్ల పార్టీకి నష్టమని తెలిపారు. దీనిపై అధిష్టానం దృష్టి సారించి, తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట



గణేష్ (ఫైల్)

పట్టణంలోని గొల్లవీధికి చెందిన వారాది గణేష్ (28) అనే యువకుడు పురుగుల మందు తాగిన ఘటనలో చికిత్స పొందుతూ ఆదివారం మరణించాడని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం... పట్టణంలోని గొల్లవీధికి చెందిన వారాది గణేష్ ఓ ప్రయివేటు కళాశాల క్యాంటీన్‌లో వర్కర్‌గా పనిచేస్తున్నాడు. ఈ నెల 10వ తేదీన అధికంగా మద్యం సేవించి ఇంటికి రావడం వల్ల భార్య మందలించింది. ఆ కోపంతో గణేష్ పురుగుల మందు తాగాడు. వెంటనే స్థానికులు పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నంలోని కెజిహెచ్‌కి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఆదివారం మరణించాడు. గణేష్ భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. గణేష్‌కు ఇద్దరు కుమారులున్నారు.